# సత్యం మాష్టారు

—శివనాగిరెడ్డి

**ఏం**టీ! అలా చూస్తున్నావు! నా మొఖానేమైనా కోతులాడుతున్నాయా!' అంది నవ్వుతూ.

అరె ఆ నవ్వు' అందంగా మరీ మనోహరంగా అనిపించింది. ఎడమబుగ్గన పడిన 'సొట్ట' అమ్మో అటే - అక్కడే చూపు నిలిచిపోతాది. పైగా పచ్చటి పసుపు ఛాయన సింధూరపు మెరుపు. ఈ పిల్ల అసలు మాష్టారి కూతురేనా! లేక శాపవశాన దివి కొచ్చిన అప్సరసా?

ఇలా నా తలనిండా పిచ్చిపిచ్చి ఆలోచనలు.

'మాష్టారు వచ్చాడు' అన్న నారాయణ మాట - నన్ను అటూ ఇటూ చూసేలా చేసింది. అప్పటికి ఏడెనిమిది మంది పిల్లలూ వచ్చారు. నేను 'స్వప్న' లోకానపడి దేన్నీ గమనించలేదు. నెమ్మదిగా అక్కడే చతికిలపడ్డాను. 'స్వప్న' లోనికెడ్తోంది. పాదాలు కనిపించినయి. మామిడి పిందెల కాలిపట్టీలు అడుగుల వడిని బట్టి కదులుతున్నాయి. ఆ పాదాలనయినా నెమ్మదిగా ముట్టుకుంటే బాగు అన్నంతగా మనస్సు అటు నడచింది.

'హోంవర్కు వ్రాసావా? నిన్న రాజుగాడ్ని బెత్తంతో వాయించాడు మాష్టారు' అన్నాడు నారాయణ.

'అలాగా!' అని సంచి విప్పాను.

వ్రాసిలేదు.

బెత్తం దెబ్బలు మనస్సులోకొచ్చి ... స్వప్నం చెదరిపోయింది.

'ఇంటి పని' పూర్తి చేశాను.

అప్పటికిగాని మనస్సు స్థిమితపడలేదు.

ఆ సాయంత్రం బడి వదిలేప్పుడు మాష్టారు ఇట్రా అని పిలిచాడు. సంచి చంకనేసుకుని బొందు 'లాగూ' వదలయి జారుతుంటే మొలతాడును దానిపైకి బిర్రుగా ఎక్కించి నడిచాను.

'అరే! శివా! నీకు అక్షరాలూ, గుణింతాలూ పూర్తయ్యాయి. బాల శిక్ష క్రమంగానే పూర్తి చేశావు. భాగాహారాలూ బాగానే చేస్తున్నావు. రేపటి నుంచి నేను మొదటి తరగతి ప్రారంభిద్దామని ఉంది. పుస్తకాలు సూరయ్య శెట్టి ఇంట ఉన్నాయి. మీ తాతగార్కి చెప్పి పుస్తకం కొనిపించుకోనిరా పై తరగతికి చేరుతున్నావు గదా. ఒక పూటకు సంబారాలూ, కొబ్బరి కాయ కూడా పట్రా. టెంకాయ దేవుడి ముందు కొడదాం' అన్నాడు.

'మంచిదన్నట్టు' తల ఊపాను. పైతరగతిలో కొస్తున్నందుకు సంతోషంగా ఉంది నాకు. బయటకు వస్తుండగా మాష్టారి ఇల్లాలు ఆయన్నే 'ఇటు వచ్చి వెళ్ళండి' అని పిలవడం వినిపించింది. ఆయన ఆవిడ దగ్గిరకెళ్ళడం, ఆవిడేమో పెద్దగా మాటాడడం వినిపించింది. ఆవిడ 'పద్ధతి'లో మా 'నాన్న' మా ఇంట్లో అందరినీ గదిమే వరస కనిపించింది.

అర్థం కాలేదు.

ఒక్క పిల్లడూ బడి ఆవరణలో కనిపించలేదు.

అన్ని ఆలోచనలనూ మరచి పరుగు లంకించుకున్నాను.

ఇంటి దగ్గర 'అమ్మ'ను చేరిందాకా అదే పరుగు.

ఆవిడ కనిపించగానే కాళ్ళకు చుట్టేసుకుని - సంచినక్కడే వదిలేసి 'మొదటి వాచకం' సంగతి అర్జంటుగా చెప్పి - 'నాకేమైనా పెట్టు' ఆకలి అన్నాను మారాం చేస్తూ.

కొబ్బరిలౌజు ప్లేటులో పెట్టి తెచ్చిచ్చింది.

దానిక్రింద వేయించిన వేరుశనగ గింజలూ ఉన్నాయి.

నేను వాటిని నమిలే కార్యక్రమంలో పడిపోయాను.

❁❁❁

**అ**మ్మ - నాన్న గారు ఇంటికి వచ్చాక నా పుస్తకం సంగతి చెప్పింది. 'నాన్న' అదోలా చూసి 'అయితే ఈ వెధవ ఇంకా బడికి వెళ్తానే ఉన్నాడంటావు' అని నవ్వుకొని 'అసలు వీడు ఇంకా జీవించి వుండడమే చిత్రం. అర్ధాయుష్షు వెధవ. మా వంశ క్రమం ప్రకారం రెండో నాడుండడు గదా!'

ఆ! ఉన్నంతవరకూ ఏదో ఒకటి చూడాలి అనుకొని 'అలాగే' అన్నట్టు తల ఊపాడు.

ఏదిఏమైనా నేను కళ్ళ ఎదుటే వున్నా మా నాన్న గారికి మాత్రం నేను 'ఊడిపోయే నాగలినే.' అంచేత ఆ పరిధిలోనే నన్ను చూడడం ఆయనకు అలవాటు.

నాన్న భావనను గమనించిన అమ్మ 'మీకు ఏళ్ళు పైబడ్డకొద్దీ చాదస్తం ముదురుతున్నది. నిక్షేపంలా నట్టింట మెదిలే పిల్లాడిని' మీరు చూసే పద్ధతి - ఏ తండ్రీ చేయలేనిది, చేయకూడనిది అని ఓ క్షణం ఆగి ఎవరు ఏ క్షణాన రాలిపోతామో ఎవరికైనా తెలుసునా? ఎప్పుడు ఎందుకు ఈ భూమి మీద పడ్డామో తెల్సిన వాడున్నాడా? ఏదో తెలిసినట్టు ఆ క్షణాన అనిపించగానే అదంతా నిజమేనా? అసలు మనకు తెల్సిందేమిటి? ఎంత? అయినా మనమెవరం నిర్ణయాల్ని చేయడానికి అని దగ్గరగా వచ్చి 'ఆపద' ఎదురొస్తున్నదంటే - ఎలా తప్పుకోవాలని ఆలోచిస్తారు తప్ప ... వాని 'రాత' అలాగే వుందని వదిలేసే వాళ్ళెవరైనా ఉంటారా? ఇక్కడ మిమ్మల్నే చూస్తున్నాను. ఇదిగో మీరు వాని కన్నతండ్రి. దాన్నయినా గుర్తుంచుకోండి' అని కళ్ళు వత్తుకుంటూ పడమటింట్లోకి చేరింది.

ఈ సంగతి ఆ రాత్రె తాతగారికి తెలిసింది.

'అరేయ్! చిన్నాడా?' అని నన్ను పిలిచాడు. ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. నీకు పుస్తకం ప్రొద్దుటే ఇప్పించుతాను. బాగా చదువుకో మీ నాన్న

## జరిగిన కథ

***సా**ర్థక నామధేయుడు ఆంజనేయులు అతనికో తమ్ముడు. చిన్నప్పుడు స్కూలుకి వెళ్తానంటే నాన్న ఒప్పుకోడు ఎట్టకేలకు సత్యం మాష్టారి వద్ద అతని చదువు ప్రారంభం అవుతుంది. మాష్టారి కూతురు స్వప్న అందాన్ని చూసి ఆశ్చర్యపోతుంటాడు.*


మాటల్ని పట్టించుకొనకు. ఏదైనా కావాలంటే నా దగ్గరకొచ్చి చెప్పు ఏం?

ఈ లాలింపుతో నాకు తాతగారంటే గౌరవం ఇబ్బడి అయింది.

ప్రొద్దుట బడికి నేను వెళ్ళక ముందే మొదట తరగతి పుస్తకం, తెల్ల కాగితాల పుస్తకం, పెన్సిలూ రబ్బరూ కొని నాకందించాడు తాతయ్య.

'బాగా చదువుకో' అని తలపై చేయివేసి ఆశీర్వదించాడు.

ఆ పుస్తకాలను తీసుకెళ్ళి మాష్టారుకు




చూపాను.

'హోరిభడవా రాత్రి చెప్పానో లేదో అన్నీ తెచ్చేసుకున్నావే' అన్నాడు సంతోషంగా నవ్వి.

ఇంతలో మా ఇంటి నుంచి మా పాలేరు భీముడు, సంబారాల పళ్ళెం తెచ్చి మాష్టారింట్లో ఇచ్చిపోయాడు.

అదే రోజున.

మొదటి తరగతిన మొదటి పాఠం నాకు




చెప్పాడు.

ఆ పేజీ వరకూ 'పలక'పైన చూసి వ్రాయం డనీ, అదీ పెద్దగా చదువుతూ -

నేనా పనిలో పడిపోయాను.

❀❀❀

దసరా వచ్చింది.

సత్యం మాష్టారు మమ్మల్ని ఒక పూట బడి మానిపించి 'పిల్లవాళ్ళకు చాలు పప్పు బెల్లాలు, అయ్యవార్లకు చాలు అయిదు వరహాలూ' అని పాడ్తూ రైతుల ఇళ్ళ వెంట తిప్పడం ప్రారంభించాడు. మొదట మా తాతయ్యే మాష్టారుకు అయిదు రూపాయలు ఇచ్చి మాకు పప్పు బెల్లాల కోసం అర్థ రూపాయి (నాల్గు బేడాలు) ఇచ్చాడు. ఆనక ఎవరికి తోచింది వారు ఇస్తూ పోయారు. కొందరు బియ్యం, కొందరు సజ్జలూ, కొందరు మొక్కజొన్నలు కూడా మాష్టారింటికి పంపారు. ఇలా మూడు దినాలు గడచినాయి.

ఆ రోజు

బాగా పొద్దుగూకింది.

చీకటి చిక్కబడింది.

ఊరు మాటు మణుగుతున్నది.

అప్పుడో 'లారీ' ఊళ్ళోకి వచ్చి బొడ్రాయి దగ్గర ఆగింది.

దానిలో నుంచి ముప్పై మంది దాకా 'రజాకార్ల'ట దిగారు. ముందు సీటు నుంచి వాళ్ళకు 'హవ్వల్‌దార్' లాంటోడు దిగి 'షేక్సిందే'కోసం కబురంపమని పురమాయించాడు రజాకార్లిద్దరు. బొడ్రాయి పక్కనున్న ఇంటి ముందాగి ఆ ఇంటి ఆసామిని బయటకు రమ్మన్నారు. 'రాములయ్య' అనే పేద రైతుదా ఇల్లు. అతనూ, భార్యా, ముగ్గురు కొడుకులూ గాబరాగా బయటకొచ్చారు. 'షేక్సిందే ఇల్లెక్కడ?' అడిగారు.

చెప్పాడు రాములయ్య.

మేము వచ్చామని చెప్పి తీసుకుని రమ్మని పురమాయించాడు.

'మీరు ఎవరని చెప్పను?' అడిగాడు రాములయ్య వారి వేషాల్ని చూసి పోలీసులుగా తలపోసి.

'దఫ్తిర్ నుంచి వచ్చామని చెప్పు' అన్నారు వాళ్ళు.

'రజాకార్ల'ట దిగారు. ముందు సీటు నుంచి వాళ్ళకు 'హవ్వల్‌దార్' లాంటోడు దిగి 'షేక్సిందే' కోసం కబురంపమని పురమాయించాడు రజాకార్లిద్దరు.

తల ఊపి బయలుదేరాడు రాములయ్య. పది నిముషాలలో ఇద్దరు షేక్సిందేల్ని వెంటపెట్టుకొని వచ్చాడు రాములయ్య.

'ఇక నువ్వు పో' అన్నారు రాములయ్యను.

వెనక్కి వచ్చి ఇంట్లో దూరాడతను.

హవ్వాల్‌దార్ లాంటివాడు షేక్సిందీలతో - కమ్యూనిస్టుల గురించీ వారు ఇక్కడికొస్తే ఎక్కడ ఏ ఇళ్ళలో ఆశ్రయమిచ్చేదీ వివరంగా అడిగాడు.

ఇద్దరు షేక్సిందీల వెంటా ఒక్కో రజాకార్ల తను ఊళ్ళోకి వెళ్ళి వాళ్ళ ఇళ్ళను చూసి తిరిగొచ్చి ఊళ్ళో ఎట్టాటి విషయం జరిగినా పోలీసు పటేలును వెంటపెట్టుకొని వచ్చి 'దప్తర్'లో చెప్పమని ఆదేశించారు. ఊళ్ళో పెద్దలు ఒకరికొకరు అనుకొని లారీ దగ్గరికి వచ్చేసరికి - లారీ ఊరు విడిచి వెళ్ళిపోయింది. ఎదురుపడ్డ షేక్సిందీలను వివరాలడిగి ఊరి పెద్దలూ ఇళ్ళకు వెళ్ళారు.

ఇది జరిగిన రెండో రోజు అర్థరాత్రి ఒక వ్యాను ఊళ్ళోకి వచ్చింది.

అకస్మాత్తుగా కొన్ని ఇళ్ళపై పడ్డారు. ఇళ్ళలో జొరబడ్డారు. వారికి కావాల్సిన పేర్లు గల వాళ్ళున్నారా? అని వాకబు చేస్తూ 'అర్థరాత్రి ఏమిటిది?' అని అడ్డగించక వాళ్ళను లాఠీలతో కొట్టారు.

ఓ గంట సేపటిలో ఊరంతా మేల్కొని భయం గుప్పెటన బిక్కచచ్చిపోయింది.

వ్యాను వెళ్ళిపోయింది.

వెళ్తూ వెళ్తూ ఊళ్ళో కొందర్ని దాన్లో తీసుకెళ్ళింది.

అయితే పొద్దు పొడుపుతో - రాత్రి జరిగిన విషయాలు అనేకం బయటకొచ్చినయి. నల్గురిని (రాత్రి ఆశ్రయమిచ్చే వాళ్ళని) తీసుకెళ్ళినట్టూ, ముగ్గురు ఆడాళ్ళను ఎత్తుకెళ్ళి చెరిపి వదిలేసిపోయినట్టూను.

ఆ సాయంత్రానికల్లా రాత్రి చెడపబడ్డ ముగ్గురిలో ఇద్దరు చనిపోయారు ఒకరు బావిలోపడి, మరొకరు ఎలకల మందు తినేసి. ఒకావిడ మాత్రం ఎటు వెళ్ళిందో జాడ తెలీలేదు. ఊరు ఊరంతా దుఃఖంలో మునిగిపోయింది. ఆ ఇద్దరు ఆడవాళ్ళ శవదహనాలు పూర్తయ్యేసరికి అపరాత్రి దాటింది. అది మొదలు మాష్టారు మాతో బయట తిరగడం ఆపాడు.

స్వప్నను చుట్టాలింటి దగ్గిర (యూనియన్‌లో ఉన్న ఆయన చెల్లెలు ఇంట) దిగబెట్టేందుకు వెంట తీసుకుని వెళ్ళి మూడో నాడు వచ్చాడు.

ఆ మర్నాటి నుంచీ శెలవులిచ్చాడు మాకు.

ఊరినుంచి రజాకార్లు పట్టుకొని పోయిన వాళ్ళు ఇంకా తిరిగి రాలేదు.

వాళ్ళ జాడ కూడా సరిగ్గా అర్థంగాని స్థితి.

పోలీసు పటేలూ, మాల్‌పటేలూ, ఊరి వాళ్ళ కోసం తమ వంతు కృషి రోజూ టౌనులోని దఫ్తరుకు వెళ్ళి చేస్తూనే ఉన్నారు.

శెలవుల్ని పిల్లలంగదా క్షణాల మీదే ఖర్చు చేశాం.

బడి తిరిగి ప్రారంభమైంది.

అయితే సత్యం మాష్టారు పాఠాలు చెప్పడంలో వెనకటి శ్రద్ధ పోయింది. ఎప్పుడూ ఆలోచనల్తో ఉండేవాడు. అప్పుడప్పుడూ చికాకు పడేవాడు. ఒక్కో రోజు అర్థాంతరంగా అందరినీ ఇళ్ళకు పంపేవాడు. ఏదో బాధ ఒక్కడుగా దిగమింగుతున్నట్టుగా అనిపించింది నాకు.

'అట్లా ఉన్నారేం మాష్టారూ' అని అడగాలనీ అనిపించింది చాలాసార్లు. కానీ ధైర్యం చాలలేదు.

ఎదురుగా నిల్చొని ఆయన్నే చూస్తూ ఉండిపోయాను.

నేను ఆ వేళ సాయంత్రం ఇంటికి వస్తున్నప్పుడు 'శివా! తాతగారు ఇంటి దగ్గర ఉన్నార్రా' అనడిగాడు. ఉన్నాడని తల ఊపాను.

మాష్టారి కళ్ళలో నీరుబికి కనిపించింది - కారణం అర్థంగాలేదు. ఆయన్ను ఏదన్నా అడుగుదామనుకున్నా అడగగల్గిన వయస్సు కాదాయె.

❖❖❖

[illegible] రోజు ఉదయం. అమ్మ చేసిన మినప కుడుములు, చింతతొక్కూ, నెయ్యిలో తిని ఉత్సాహంగా పుస్తకాల సంచీ చంకనేసుకొని బడికి వెళ్ళాను. బడిలో కొద్ది మంది పిల్లలున్నారు. కానీ సందడి లేదు.

ఉన్న పిల్లల మొఖాన ఉత్సాహమూ లేదు - బితుకు బితుకుమంటున్నారు.

అంతా ఎందుకు రాలేదూ? నేనుగాని పెందలాడే వచ్చానా అని పైకి చూశాను.

వేళదాటే కనిపించింది.

నెమ్మదిగా కూర్చుండిపోయాను.

అయిదారు బారల పొద్దు వేడెక్కి చిటపటలాడిస్తున్నది.

మేం రోజూ కూర్చునే చాపలూ అన్నీ పరచిలేవు. కూర్చుని ఉన్న కొద్ది మంది చాపలేసుకుని కూర్చునలేదు.

నెమ్మదిగా లేచి నారాయణ కోసం వెతికాను. కనిపించలేదు.

మాష్టారి ఇంటి లోపలికి చూశాను.

వెనక వసారాకున్న 'మోపు'కు ఆనుకొని చతికిలపడి ఏడుస్తున్న మాష్టారు కనిపించారు.

ఆయన వాలకం చూస్తే ఏదో జరగరానిదే జరిగిందనిపించింది. ఇంతలో మాష్టారు భార్య శోకాలు కొంచెం పెద్దగానే బయటకు వినిపించినయి. అటుగా మెడచాపి చూశాను. నడిమింట అస్తవ్యస్తంగా కూర్చుని ఏడుస్తోందావిడ.

నాకు నిజంగా భయమైంది.

అక్కడ నుంచి పారిపోవాలనిపించింది.

స్వప్నగానీ వచ్చిందేమోనని అంతా 'పార' చూశాను.

ఉన్న జాడలేదు.

చుట్టుప్రక్కలున్న ఇళ్ళలోనూ ఏ అలికిడీ వినిపించలేదు. మామూలుగానే ఉన్నట్టనిపించింది.

మాష్టార్ని చూస్తే దుఃఖం ఆగలేదు. కన్నీరు రాసాగింది. నెమ్మదిగా ఆయన దగ్గరికే కళ్ళు నులుముకుంటూ నడిచాను. నేను కనిపించానాయనకు.

అరే శివా! అంటూ నా దగ్గరకు జరిగి, నన్ను వాటేసుకొని పసివానిలా వెక్కెక్కి పడుతూ ఏడ్చాడు.

నాకు భయంతో వణుకు ప్రారంభమైంది.

ఆయన్ని ఎలా ఓదార్చాలో అర్థమూ కాలేదు.

కళ్ళు తుడుచుకుంటూ ఉండిపోయాను.

**మాష్టారి కన్నీరును నా చేత్తో తుడిచి నెమ్మదిగా వెనక్కి మళ్ళాను. ఏడుస్తూనే రోడ్డుపైన మా 'అన్న' కనిపించాడు - నేను వెనక్కుమళ్ళగానే.**


మా ఇద్దర్నీ గమనించిన మాష్టారి భార్య మంచం దిగి - మాదాకా వచ్చి ఆయన తొడపైన తలమోపి పెద్దగా ఏడ్చింది. అలా చాలాసేపు నేనక్కడే ఉన్నాను.

మాష్టారి కన్నీరును నా చేత్తో తుడిచి నెమ్మదిగా వెనక్కి మళ్ళాను. ఏడుస్తూనే రోడ్డుపైన మా 'అన్న' కనిపించాడు - నేను వెనక్కుమళ్ళగానే.

పైగా - నన్ను 'బేగి' రమ్మని సైగలు చేస్తున్నాడు. అలా ఎంతసేపటి నుంచి నా కోసం - తిప్పలు పడుతున్నాడో పాపం.

అసలు ఇక్కడ జరిగిందేమిటో, నేనెందుకు మాష్టార్ని చూసి ఏడుస్తున్నానో, అన్న నన్నెందుకు పిలుస్తున్నాడో బొత్తిగా తోచలేదు.

నేను నెమ్మదిగా మాష్టార్ని వెనుదిరిగి చూస్తూనే వరండా దాటి లోపలకు వచ్చాను.




అన్న గబగబా నా దగ్గరకు వచ్చి 'నాన్న నిన్ను ఉన్నపళంగా వెంట తీసుకుని రమ్మన్నాడు' అన్నాడు నెమ్మదిగా.

నేను మారుమాటాడక వాని వెంట నడిచాను. నా పలకా, పుస్తకం అక్కడే ఉండిపోయినయి. పైగా నేను బయటకొస్తుంటే ఒక పిల్లాడూ అక్కడ కనిపించలేదు. అంటే నేను మాష్టారి దగ్గర ఉండగానే వెళ్ళిపోయారన్నమాట.

మా అన్న మాత్రం 'రారా త్వరగా నడు' అని తొందర పెడుతున్నాడు.

ఇంతలో మాష్టారి ఎదురింట్లో పాచి పని చేసే కాంతమ్మ ఎదురుగా వస్తూ కనిపించింది. ఆమె ఎదురుగా ఆగి అడిగాను 'సత్యం మాష్టారు ఎందుకలా ఏడుస్తున్నాడు, ఏమయింది?' అని.

''ఆయన కేమయింది? ఏమీగాలేదు. వాళ్ల స్వప్నమ్మ లేదూ, ఆవిడను రజాకార్లూ ఇక్కడికి వస్తుంటే - అటకాయించి ఎత్తుకు పోయారట. రెండు రోజులుంచుకుని వదిలేశారట. వాళ్ళ పాలబడి తిరిగి ఇంటి ముఖం ఏం చూడగలదు పాపం. అందుకే ఎవర్నో వెంటపెట్టుకొని ఎటో లేచిపోయిందట ... అంత మంచోనికి ఇట్టాటి కష్టమొచ్చింది' అంటూ నడిచింది.

లేచి పోవడమంటే ఏంటీ? అడిగాను అర్థంగాక.

'ఛా! పదా' అని ముందుకు నెట్టాడు అన్న.

'వాడు చెప్పడు, అడిగి తెల్సుకోనివ్వడు. ఏం మనిషో వీడు?' అనుకుంటూ నడిచాను.

(సశేషం)